క్లుప్తంగా

మానసాదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మానసాదేవి నాగశక్తి

చీపురుపల్లి: మండలంలోని రామలింగాపురం పరిసరాల్లో గల మానసాదేవి నాగశక్తి అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థ,ప్రసాదాలు స్వీకరించారు.

సోంపురం విద్యార్థుల ప్రతిభ


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు సుపథ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. వేపాడ, లక్కవరపుకోట మండల స్థాయి సుపథ పోటీలు లక్కవరపుకోటలో ఆదివారం నిర్వహించారు. శ్లోకపఠనం పోటీల్లో సోంపురం పాఠశాలకు చెందిన విద్యార్థులు పి.బాలజీ, వి.సుధీర్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. అలాగే క్విజ్, పద్యపఠనం పోటీల్లో హెచ్. దిలీప్, హెచ్. దీక్షిత, ఈ. నందిని, హెచ్.వర్షిణి ప్రతిభ కనబరిచారు. దీంతో విద్యార్థులను హెచ్ఎం బీపీఏ రాజు, ఉపాధ్యాయులు వి.జగన్నాథం, బి.జ్యోతి, తదితరులు అభినందించారు.

విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు, ఉపాధ్యాయులు

దత్తిరాజేరు: విజయనగరంలో జరుగుతున్న జనవిజ్ఞాన వేదిక 18వ రాష్ట్ర మహాసభలలో పలు పాఠశాలల విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో ఆర్. రామచంద్రపురం పాఠశాల చెందిన రోహిత్. మణికంఠలు రూపొందించిన ప్రాజెక్ట్ ఆకట్టుకోవడంతో జనవిజ్ఞాన వేదిక నాయకులతో పాటు పాఠశాల హెచ్ఎం కృష్ణమూర్తినాయుడు, ఉపాధ్యాయులు చిన్నారులను అభినందించారు.

శ్రమదానంతో గండి పూడ్చివేత


గండిని పూడ్చుతున్న రైతులు

జామి: మండలంలోని వెన్నెలో సుమారు 600 ఎకరాలకు సాగునీరు అందించే చెక్‌డ్యామ్ (చప్టా) శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల కురిసిన వర్షానికి గండి పడింది. దీంతో సాగునీరు వృథాగా పోతోంది. దీంతో రైతులందరూ ముందుకు వచ్చి శ్రమదానంతో ఇసుక బస్తాలతో ఆదివారం గండిని పూడ్చారు. ఇందుకోసం రైతులు సుమారు 50 వేల రూపాయలు సేకరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. తాత్కాలికంగా పూడ్చిన గండి మళ్లీ కొట్టుకుపోయే ప్రమాదముందని.. అధికారులు, పాలకులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన గండిని పూడ్చాలని కోరుతున్నారు.

మొరాయించిన బస్సు


సిటీబస్సును తోస్తున్న ప్రయాణికులు

వేపాడ: కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులు తిప్పుతుండడంతో ఎప్పుడు ఆగిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంటోంది. వేపాడ మండల కేంద్రానికి మద్దిలపాలెం, గాజువాక డిపోలకు చెందిన రెండు బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఆదివారం ఉదయం ఐదు గంటలకు విశాఖ ఆర్టీసీకి కాంప్లెక్స్ బయలుదేరిన బస్సు కొద్ది నిమిషాల్లోనే మొరాయించింది. దీంతో ప్రయాణికులు బస్సును తోయగా.. సెల్ఫ్ అవ్వడం.. ఆగిపోవడం జరిగింది. సుమారు గంట కాలం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. ఆర్టీసీ అధికారులు కండీషన్ ఉన్న బస్సులను తిప్పాలని పలువురు కోరుతున్నారు.

రెడ్‌క్రాస్‌లో అందుబాటులో బ్లడ్..

చీపురుపల్లి: జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్‌లో బ్లడ్ యూనిట్స్ అందుబాటులో ఉన్నాయని రెడ్‌క్రాస్ చీపురుపల్లి డివిజన్ కోఆర్డినేటర్ బీవీ గోవిందరాజులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తం అవసరమైన వారికి డోనర్‌తో సంబంధం లేకుండా బ్లడ్ యూనిట్స్ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. అయితే క్రాస్ మ్యాచింగ్ పరీక్ష కోసం మాత్రమే రూ.800 చార్జీలు వసూలు చేస్తారని తెలిపారు. డోనర్ అవసరం లేకుండా తలసేమియా, సికిల్‌సెల్, ఎనీమియా, హెచ్ఐవీ, క్యాన్సర్ రోగులకు ఉచితంగా బ్లడ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 08922-272700 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇరుకు గదులే దిక్కు..

- డాక్టర్లున్నారు...మందులున్నాయి.. భవనాల్లేక అవస్థలు
- బల్లంకి హోమియో ఆస్పత్రిలో వర్షం పడితే భవనమంతా నీరే
- వేపాడ ఆయుర్వేదిక్ ఆస్పత్రికి భవనం కొరత..
- శిథిలావస్థలో వేపాడ మండల వ్యవసాయ కేంద్రం


బల్లంకి హోమియో వైద్యశాలలో సేవలందిస్తున్న హోమియో వైద్యాధికారి శిరీష

వేపాడ: జిల్లాలో వెనుకబడిన మండలం ఏదైనా ఉందంటే ఠక్కున గుర్తుకు వచ్చేది వేపాడే. జిల్లా కేంద్రానికి శివారు కావడంతో పాటు అనకాపల్లి జిల్లా సరిహద్దుగా ఉన్న వేపాడ మండలంలో మండల స్థాయి అధికారులున్నారు.. వైద్యసేవలు అందించేందుకు హోమియో, ఆయుర్వేదిక్ వైద్యులున్నారు. అయితే సరైన భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. హోమియో, ఆయుర్వేదిక్ ఆస్పత్రులకు సరైన భవనాలు లేవు. అలాగే పలు ప్రభుత్వ కార్యాలయాలు శిథిల భవనాల్లోనే కాలం వెళ్లదీస్తున్నాయి. సరైన వసతులు లేకపోవడంతో అధికారులు సేవలు అందించలేకపోతున్నారని మండల ప్రజలు చెబుతున్నారు. జిల్లా అధికారులు ఎప్పుడో గాని మండలాన్ని సందర్శించకపోవడంతో వేపాడ అభివృద్ధిలో వెనుకబడి ఉందని చెప్పక తప్పదు. మండలంలో 29 పంచాయతీల్లో 37 రెవెన్యూ గ్రామాల పరిధిలో సుమారు 55 వేల మంది జనాభా ఉన్నా.. అభివృద్ధికి నోచుకోకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


శిథిలావస్థలో ఉన్న బల్లంకి హోమియో వైద్యశాల భవనం

బల్లంకిలో హోమియో వైద్యశాల..

దశాబ్దాల కిందట బల్లంకిలో ఏర్పాటు చేసిన హోమియో వైద్యశాలకు నేటికీ పక్కా భవనం లేదు. పాత పంచాయతీ భవనంలో విధులు నిర్వహిస్తూ రోగులకు సేవలందిస్తున్నారు. ప్రస్తుతం ఆ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. చిన్నపాటి వర్షానికి కూడా భవనం కారిపోతుండడంతో సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. ఈ ఆస్పత్రిని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎంపీపీ సత్యవంతుడు, సర్పంచ్ కనకరాజు పరిశీలించినా ఫలితం లేకపోయింది. అయితే ఆయుస్మాన్ భవనంలో ఉన్న ఓ గది హోమియో వైద్యశాలకు తాత్కాలికంగా కేటాయిస్తే మందులు భద్రపరచడంతో పాటు రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయమై పాలకులు, అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.


ఆయుర్వేదిక్ ఆస్పత్రి భవనం దుస్థితి

ఒక్క గదిలోనే ఆయుర్వేదిక్ డిస్పెన్సరీ

వేపాడలో దశాబ్దాల కిందట ఆయుర్వేదిక్ డిస్పెన్సరీ ఏర్పాటు చేశారు. అప్పట్లో పీహెచ్‌సీ లేని సమయంలో ప్రజలకు ఆయుర్వేదిక్ వైద్యసేవలు అందేవి. అనంతరం ఈ డిస్పెన్సరీ కొన్నాళ్లు వేపాడ గవిరమ్మసావిడిలో.. మరికొన్నాళ్లు వల్లంపూడిలో.. ఇప్పుడు వేపాడ పీహెచ్‌సీ ప్రాంగణంలో ఓ చిన్న గదిలో ఆయుర్వేదిక్ వైద్యశాల నిర్వహిస్తున్నారు. ఆ గదిలోనే మందులు నిల్వ చేసుకోవాలి.. వైద్యుడు రోగులను పరీక్షించాల్సి రావడంతో మెరుగైన సేవలు అందడం లేదు. అధికారులు స్పందించి కొత్త భవనం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరుకున్న వ్యవసాయ శాఖ కార్యాలయం

శిథిలావస్థలో వ్యవసాయ కార్యాలయం..

వేపాడలో మండల వ్యవసాయ కార్యాలయం భవనంలో కిందన గిడ్డంగి.. పైన ఏఓ, తదితరులకే కేటాయించారు. ప్రస్తుతం ఈ భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. కనీసం రికార్డులు భద్రపరుచుకోలేని దుస్థితి. దీంతో స్థానిక వేపాడ రైతుసేవా కేంద్రంలో ఓ చిన్న గదిలో మండల వ్యవసాయశాఖ సిబ్బంది విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదమరిచారో.. అంతే సంగతులు


ఎస్‌కే సర్వాగీ మైనింగ్ బంటా వద్ద ప్రమాదకరంగా కోతకు గురైన చినరవ్యాం బీటీ రహదారి

- ప్రమాదకరంగా చినరవ్యాం రహదారి

మెరకముడిదాం: ఆ రహదారిలో ప్రయాణించేప్పుడు ఏమాత్రం ఆదమరిచి ఉన్నా ప్రమాదం కొని తెచ్చుకున్నట్లే. రహదారి కోతకు గురికావడంతో ప్రమదకరంగా మారింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని చినబంటుపల్లి నుంచి చెల్లాపురం వెళ్లే ప్రధాన రహదారి నుంచి చెల్లాపురం మధుర గ్రామమైన చినరవ్యాం గ్రామానికి వెళ్లే బీటీ రహదారిని ఆనుకొని చీపురుపల్లి సర్వాగీకి చెందిన మైనింగ్ బంటా ఉంది. రహదారికి ఆనుకుని మరీ మైనింగ్ చేయడంతో కొద్ది రోజుల కిందట కురిసిన వర్షాలకు ఈ బంటాలోకి నీరు చేరింది. ఈక్రమంలో రహదారిలో కొంతభాగం కోతకు గురైంది. దీంతో ఈ రోడ్డుమీదుగా రాకపోకలు సాగించేటప్పుడు ఏమాత్రం అలక్ష్యంగా ఉన్నా వందల అడుగుల లోతులో ఉన్న గొయ్యిలో పడిపోక తప్పదు. ఎటువంటి ప్రమాదాలు జరగకముందే పాలకులు, అధికారులు స్పందించి ఈ ప్రదేశంలో రక్షణ గోడను నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

అంబేడ్కర్ ఆశయాలను నెరవేరుద్దాం


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న దళితఉద్యమ నేత ఆతవ ఉదయ్‌భాస్కర్

జామి: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలను నెరవేరుద్దామని దళిత ఉద్యమ నేత ఆతవ ఉదయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. మండలంలోని పావాడ, తానవరం గ్రామాల్లో ఆదివారం ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, వైద్యం, ఉపాధి రంగాలలో దళితులు ముందుకు సాగాలన్నారు. అంబేడ్కర్ విజ్ఞానకేంద్రాలలో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుర్రపు శ్రీను, తెరపల్లి కోటరావు, బోనెల ఈశ్వరరావు, సూరిబాబు, ఎం. వెంకటరమణ, శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి


ఎస్.కోటలో నిరసన తెలియజేస్తున్న ఆటో డ్రైవర్లు

శృంగవరపుకోట: ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17న చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద ఏఐటీయూసీ నేతలు కండిపల్లి భీముడు, దేగల అప్పలరాజు, ఏఐఎస్‌టీయూ నేతలు ఎస్.అప్పలరాజు, నాయుడు, పండు , సురేష్, కృష్ణ, తదితరులు మాట్లాడుతూ.. స్త్రీ శక్తి పథకం వల్ల ఆటో డ్రైవర్లు నష్టపోతున్నారన్నారు. స్వయం ఉపాధి కోసం ఆటోలు నడుపుకుంటున్న డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పోలీస్, ఆర్టీఏ వేధింపులు ఆపడంతోప ఆటు వాహనమిత్ర పథకంలో భాగంగా రూ. 25,000 చొప్పున ఆర్థిక సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలు ఆటోస్టాండ్లకు చెందిన ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి


నియామకపత్రాలు పంపిణీ చేస్తున్న బూత్ ఇన్‌చార్జ్ రమణ

బొండపల్లి: గ్రామాల్లో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల బూత్ ఇన్‌చార్జ్ మహంతి రమణ పిలుపునిచ్చారు. మండలంలోని బిల్లలవలసలో పార్టీ అనుబంధ విభాగాల సభ్యులుగా నియమితులైన వారికి ఆదివారం నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి గ్రామస్థాయిలో క్షేత్రస్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, వేంద్రాం సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ లెంక సన్యాసినాయుడు, నాయకులు చింతపల్లి అరుణ్‌కుమార్, సుంకరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన వాహనాలు నిలిపితే చర్యలు

బొండపల్లి: జాతీయ రహదారి 26 పక్కన భారీ వాహనాలను నిలిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. బోడసింగిపేట నుంచి గొట్లాం బైపాస్ రోడ్డు వరకు కూడా నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల వద్ద మాత్రమే వాహనాలు నిలపాలన్నారు. ఈ విషయాన్ని వాహనదారులు గమనించాలని కోరారు.

ఐకమత్యంతో ముందుకెళ్దాం..


సమావేశంలో పాల్గొన్న ఇనాం రైతులు

- ఇనాం భూముల రైతులు

చీపురుపల్లి: ఎన్నో దశాబ్దాలుగా ఇనాం సమస్యతో అవస్థలు పడుతున్నాం.. ఇప్పటికైనా ఇనాం రైతులంతా పార్టీలకతీతంగా ఏకతాటిపైకి వచ్చి సమస్యను పరిష్కరించుకుందామని తీర్మానించుకున్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ జి. అగ్రహారానికి చెందిన ఇనాం రైతులు ఆదివారం స్థానిక సచివాలయ ఆవరనలో సమావేశమయ్యారు. జి.అగ్రహారం పరిధిలో ఎన్నో వందల సంవత్సరాల కిందట నుంచి 1190 ఎకరాలు ఇనాం భూములున్నాయని తెలిపారు. ఆ భూములను అగ్రహారంనకు చెందిన రైతులే సాగు చేసుకుంటున్నప్పటికీ, వాటిపై ఎటువంటి హక్కులు లేకపోవడం బాధాకరమన్నారు. కనీసం వన్‌బీ కూడా రైతుల పేరిట రాకపోవడంతో అన్నదాత సుఖీభవ వంటి పథకాలు వర్తించడం లేదని చెప్పారు. రెవెన్యూ రికార్డుల్లో ఇనాం అని ఉన్నప్పటికీ.. ఆ భూములకు ఇనాం వారసులెవ్వరూ లేరని, ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న తమకే హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇనాం భూముల సమస్యను రెవెన్యూ అధికారులు దృష్టికి సమష్టిగా తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు.

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ బి.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారు వివిధ రూపాల్లో, విశేష అలంకరణలతో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి 10.30 వరకు చండీహోమం, 30న అష్టోత్తర శత కలశాభిషేకంతో పాటు సామూహిక లక్ష కుంకుమార్చన పూజలు ఉంటాయని పేర్కొన్నారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

గంట్యాడ: మండలంలో ఉన్న పశువులకు సోమవారం నుంచి అక్టోబర్ 15 వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశుసంవర్థకశాఖ ఎ.డి రెడ్డి కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి ఆయా గ్రామాలకు వెళ్లి టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. గాలికుంటు వ్యాధి ఎక్కువగా సంకరజాతి పశువుల్లో వ్యాపిస్తుందని.. ఈ వ్యాధి సోకితే నోటి జడుపు, కాలు జడుపు వచ్చి పాల దిగుబడి బాగా తగ్గిపోతుందని చెప్పారు. రైతులు, పశువుల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జామిలో..

జామి: మండల వ్యాప్తంగా సోమవారం నుంచి అక్టోబర్ 15 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారులు నరేష్ కుమార్, గీతారాణి ఒక ప్రకటనలో తెలిపారు. దూడలు, పశువులు ఆరోగ్యంగా ఎదగడానికి టీకాలు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

నేడు ఆర్‌ఎస్‌కే వద్ద నిరసన

దత్తిరాజేరు: రైతులకు యూరియా సరఫరా చేయడంలో విఫలమైన ప్రభుత్వం తీరుకు నిరసనగా సోమవారం స్థానిక రైతుసేవా కేంద్రం వద్ద ఇంగిలాపల్లి రైతులు నిరసన చేపట్టనున్నారని గ్రామపెద్ద గర్భాపు శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. శనివారం యూరియా అందజేస్తామని చెప్పిన వ్యవసాయ అధికారులు సకాలంలో అందివ్వలేకపోయారన్నారు. నిరసనలో రైతులందరూ పాల్గొనాలని కోరారు.

ఘనంగా పశువుల పండుగ


వేపాడ: దబ్బిరాజుపేటలో అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

గంట్యాడ: మండలంలోని బుడతానపల్లిలో పశువుల పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేపచెట్టుకు (అమ్మవారు) ప్రత్యేక పూజలు చేసి వేపాకులు, పసుపు కలిపిన నీటిని పశువుల మీద చల్లారు. కార్యక్రమంలో సర్పంచ్ అలమండ వాణి, ఎంపీటీసీ సభ్యురాలు వర్రి అర్జునమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా..

వేపాడ: మండలంలోని పలు గ్రామాల్లో పశువు లమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. వేపాడ, వల్లంపూడి, దబ్బిరాజుపేట, రాయడుపేట, గుడివాడ, బొద్దాం, తదితర గ్రామాల్లో పశువుల పండుగ సందర్భంగా అమ్మవారిని ఊరేగించారు. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్ పూర్తయిన పశువుల పండుగ చేపడతామని ఆయా గ్రామాల పెద్దలు తెలిపారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

లక్కవరపుకోట: మండలంలోని కొట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జామి అప్పలనాయుడు ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే హిందీ భాషలో గేయాలు, పలు రకాల కృత్యాలు నిర్వహించారు. అనంతరం పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కామేష్, ఉమ, తదితరులు పాల్గొన్నారు.


హిందీ భాషా దినోత్సవం సందర్భంగా నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు